# స్వయంపాకం

ఆఫీసులోనుంచి కోటయ్య అడుగు బయటపెట్టగానే ట్రాం వెళ్ళిపోయింది. అకస్మాత్తుగా అతనికి తట్టింది_ 'పొద్దున్నే చాకలిపేటనుంచి బయల్దేరి మైలాపూర్ చేరి సాయంకాలం పూట షెడ్‌కి చేరుకునే ట్రాం కీ తనకీ భేదం ఏముంది?'

కోటయ్య ఆ ఆఫీసులో పాతిక రూపాయలమీద పని చేస్తున్నాడు. బ్రహ్మచారిఅవటంవల్లా, ఇంద్రియాలను జయించిన వాడు అవటంవల్లా, అందులోనే ముడుచుకొని బతుకుతున్నాడు. రెండుపూటలు భోజనం చేస్తాడు. ఆఫీసులో అంకెలు కూడతాడు. రాత్రిళ్ళు హాయిగా నిద్రపోతాడు. ఇంతకంటే ఏం చెయ్యాలని కానీ అతనికి ఎన్నడూ తట్టలేదు. కాని నాలుగురోజుల్నించీ మాత్రం అతని మనస్సు సరిగ్గా వుండటంలేదు. ఊరికే ఆరాటపడుతుంది. ఎందుకో గింజుకుంటుంది! మొన్న భోజనంచేసి బయటకు వచ్చేటప్పటికి, తన పసరంగా సిగరెట్ తాగబుద్ధయింది. నిన్న ఆఫీసుకి వెళ్ళేటప్పుడు ఒక పడుచు ఎదురైతే అనవసరంగా ఒళ్ళు జలదరించింది పైగా నిన్నటి రాత్రి నిద్ర పట్టలేదు తన గదంతా బూజుపట్టిందనీ, మంచి నీళ్ళు తాగటానికి కూజా లేదనీ, నిన్న రాత్రే కోటయ్యకు తెలిసింది. ఈ తెలియటాలు అతని మనస్సుని చీకాకు పరిచాయి. తన పాత ప్రపంచం బెత్తికలు బెత్తికలుగా వూడిపోతున్నట్లూ, తనకు అర్ధంకాని వూబిలోకి అడుగడుగున చొప్పున దిగిపోతున్నట్లూ బాధపడ్డాడు. ఇప్పుడీ ప్రశ్నతో మరీ తికమకపడ్డాడు. "ప్రొద్దున్నే చాకలిపేటనుంచీ...."

పక్కనున్న కొట్టులో ద్రాక్ష గుత్తులు వేలాడుతున్నాయి. ఆంగ్లో యిండియన్లు చెట్టాపట్టాలు పట్టుకొని సముద్రతీరానికి షికారు వెళ్తున్నారు. పాకీవాళ్ళిద్దరు రోడ్లు బాగుచేస్తూ సరసాలాడు కుంటున్నారు. ఒక యువతి కిటికిలో నుంచి దారిపొయ్యేవాళ్ళని చూచి గుటకలు మింగు

తూంది. ఆ యింటిమీద పావురాళ్ళు గుటుగుటు మంటున్నాయి. కాఫీ హోటల్లోనుంచి జనం కాఫీతాగి కిల్లీలు నవుల్తూ సిగరెట్లు వూస్తూ బయటికి వస్తున్నారు.

ప్రపంచం యింత సందడిగా కోటయ్యకు యిదివరకెప్పుడూ కనిపించలేదు. అతనికి సందడి గిట్టదు. ఆఫీసులోని కలాల బరబర తప్ప మరే మోతా సహించలేడు. మిగిలిన మోతలకు నరాలు సళ్లిస్తయి. అందుకని సందు గొందుల్లో నుంచి యింటికి పోవటానికి ప్రయత్నించాడు. బయటి ప్రపంచాన్నంతా మరిచిపోయి ఆలోచించుకోవటం నూతనానుభవం అవటంవల్ల ఉత్సాహం కలిగింది. శరీరం వేడెక్కింది.

పుల్లయ్యకి కలిగిన అనుభవంలో, ఆనందంలో వీసమైనా తన కెందుక్కలగదు? పుల్లయ్య తనకంటే యే విధంగా గొప్పవాడు? చదువుకొనే రోజుల్లో అతనికంటే తనకే ఎక్కువమార్కు లొచ్చేవి. మాస్టర్లంతా తనమీదే ఎక్కువ అభిమానంగా వుండేవాళ్ళు. పుల్లయ్య అప్పట్నుంచీ ఆకతాయే! కోతికొమ్మచ్చులమీద చర్ బొప్పాయి గుళ్ళమీదా తప్ప, చదువుమీద ధ్యాసే వుండేదికాదు. జీతంలోమాత్రం? తానేదో కొద్దోగొప్పో సంపాదిస్తున్నాడా? పుల్లయ్య కదీలేదుగదా! ఇంకా అతని బుర్రలో కోతికొమ్మచ్చిలూ, చర్ బొప్పాయిగుళ్ళే తిరుగుతూవుండె! కాని, అతని అనుభవాలు!

ఒకరాత్రి పుల్లయ్య రైల్లో ప్రయాణం చేస్తున్నాడు. గుంటూర్లో భార్యభర్తలిద్దరు అతని పెట్టెలో యెక్కారు కొంచెం సేపయిం తరువాత పుల్లయ్య నిద్రపోయాడు. కాని చుండూరు స్టేషన్ వచ్చేటప్పటికి ఎవ్వరో అరికాలు గీకారు. పుల్లయ్య ఉలిక్కిపడి లేచి చూసేటప్పటికి పక్కనే కూర్చున్న ఆ పిల్ల చిరునవ్వు నవ్వింది. ఆమె భర్త గుర్రుపెట్టి నిద్ర పోతున్నాడు! ఇంక ఆ పెట్టెలో మరోపిట్టలేదు.

మరొకరోజు పుల్లయ్య ట్రాంలో ప్రయాణంచేస్తున్నాడు. సుంద రాంగి ఒకతె ట్రాం ఎక్కింది. సరాసరి వొచ్చి చెయ్యీ చెయ్యీ రాసుకొనే

ట్లు అతనిదగ్గర కూర్చుంది. ఆ ట్రాంలో చాలామంది వున్నారు! కాని ఆ పడుచు లెక్కచెయ్యలేదు. పుల్లయ్య తొడని నెమ్మదిగా, కమ్మగా గిల్లటం మొదలుపెట్టింది. పుల్లయ్య ఆమెకోమలకరపల్లవాన్ని జాలిగా నిమిరాడు! ఇద్దరి చూపులు కలిసినయి. ఆమె ట్రాం దిగేచోటే అతనూ దిగాడు.

ఇంకొకరోజు పుల్లయ్య మరొకయువతిని పెళ్ళిలో కలుసుకున్నాడు. వధూవరులు తలంబ్రాలు పోసుకుంటూవుంటే ఆ యువతి రెప్పవెయ్యకుండా పుల్లయ్యనిచూస్తూ కూర్చుంది అతడూ చూశాడు. ఆమె వెంటనే రెప్ప వేసింది. అతడేదోపని వున్నట్టులేచి, బయటకు వెళ్ళాడు రెండు నిమిషాల్లో ఆ యువతికూడా బయటేదో పని కలిగింది.

ఇలాంటి అనుభవాలు తన కెందుకు కలగవు? తానెన్నిసార్లు రైలెక్కుతున్నాడు? ఎన్నిసార్లు నిద్రపోతున్నాడు? ఎన్ని ట్రాములెక్కుతున్నాడు? ఎన్ని దిగుతున్నాడు? ఎన్ని పెళ్ళిళ్ళకు వెళుతున్నాడు? పని వున్నట్లు ఎన్నిసార్లు బయటకి వెళుతున్నాడు? ఆ సుందరాంగి అరికాలు గీక్కపోతేపోయింది, జుట్టన్నా పీకదే! మెత్తగా, కమ్మగా గిల్లకపోతే గిల్లకపోయింది తొడపాశమన్నా పెట్టదే! తాను చూడగానే రెప్పవెయ్యక పోతే పోయింది. రెప్ప వెయ్యకుండానన్నా చూడదే.

ఇలా ఆలోచించుకుంటూ, ఒక్కసారి తన జీవితాన్నంతా జ్ఞాపకం తెచ్చుకున్నాడు కోటయ్య. తనకంటె యమధర్మరాజుని మోసే దున్నపోతే నయం అనుకున్నాడు. మానవుడికి ధైర్యం వుండాలి, ఉత్సాహం వుండాలి. అప్పుడుగాని ప్రపంచంలోని అందాలు అతని అనుభవంలోకి రావు అని తేల్చుకున్నాడు. తానెందుకు పూనుకోగూడదు? శరీరం విదిలించుకున్నాడు. చల్లగాలిని లోపలికి పీల్చుకున్నాడు. స్థయిర్యంతో, ఆత్మవిశ్వాసంతో రొమ్ము విరుచుకొని నూతన రాజ్యాలకోసం వెతికే యోధుడికిమల్లే అటూ ఇటూ చూశాడు.

దగ్గర్లో శశిరేఖ ఇల్లు కనిపించింది. శశిరేఖ ఆ పట్టణంలో పెద్ద స్టారు. కోటయ్య ఆమెని యెప్పుడూ చూడకపోయినా, ఒకటి రెండుసార్లు వాల్‌పోస్టరుమీద ఆమెబొమ్మని చూశాడు. ఏదో రోగంతో బాధపడుతున్నట్లు

కనబడేచూపులూ, వెక్కిరిస్తున్నట్టు పైకి తిరిగిన ముక్కూ, బాలింతరాలి దవడలూ.... ఆమెను చూస్తే అతనికేదో జాలికలిగేది. నెమ్మదిగా ఆమె ఇంటిదగ్గరకు వెళ్ళాడు,ఇంటిముందు కారు నిలబడివుంది. ఆ కారు అతనికి చాలా అందంగా కనిపించింది. ఆమె ఇంటిముందున్న పూలతోటని చూస్తే అహ్లాదంకలిగింది. బయట కారునీ తోటలోని పూలమొక్కలీన్నీ, ఇంటినీ చూచి, ఇంటిలోని శశిరేఖని వూహించుకుంటే అతనికి ఉత్సాహం,ఆనందం, పరవశత్వం కలిగాయి. ఇప్పుడా స్టారు ఏం చేస్తుంటుంది? స్టారింట్లో స్టారుంది. స్టారుతోటలో మొక్కలున్నాయి. ముందు కారుంది. కాని గడపలో వొకడు కూర్చొనివున్నాడు. కోటయ్య ధైర్యంచేసి అతన్ని అడిగాడు.

"ఎవ్వరి దీ ఇల్లు?"

అతడు చెప్పాడు.

"ఏం చేస్తూవుంది?"

"డ్రెస్ వేసుకుంటూ వుంది"

కోటయ్య కళ్ళుమూసుకొని ఒక్కక్షణం ఆ దృశ్యాన్ని హృదయ ఫలకంమీద చిత్రించుకొని, చిరునవ్వు తృప్తిగానవ్వుకొని మళ్ళీ అడిగాడు.

"ఎక్కడికి వెళ్తూవుంది?"

"సినిమా?"

"ఏ సినిమా?"

అతడు చెప్పాడు.

అకస్మాత్తుగా కోటయ్యకొక ఉపాయం తట్టింది. తట్టీతట్టడంతోనే ఆరాటం హెచ్చింది. బుర్రంతా చదలపుట్టలా గులగులమంది. ఆచరణలో పెట్టవలసిందే! మనోధైర్యంతో సాధించవలసిందే! ప్రతిజీవికీ ప్రపంచంలో సుఖపడే అవకాశంవస్తుంది. దాన్ని వినియోగించుకోవాలి. ఏమో ఏ క్షణంలో అదృష్టం కిర్రున మళ్ళుతుందో ఎవ్వరు చెప్పగలరు?

కోటయ్య యిక వెనకా ముందూ ఆలోచించలేదు. ఒక మహాకార్యం సాధించ దలచినప్పుడు గుంజాటనం పనికిరాదు. వెంటనే బయల్దేరి ఆ సినిమాహాలుదగ్గరకు వెళ్ళాడు. హాలుముందు జనం తొక్కుడు పడుతున్నారు

న్నారు. ఏ క్లాసుటిక్కెట్లూ అందటంలేదు. అప్పుడప్పుడూ పోలీసువాళ్ళ కూడా చెఖ్కు చేసుకోవలసి వస్తూవుంది. అంతా తనకు అనుకూలంగానే వుంది! ఇక మనోబలమే కొరవ!

అనుకున్నాడేగాని, ఆ స్టారుకారొచ్చి ఆగేటప్పటికి కోటయ్య గుండెలు దడదడ కొట్టుకున్నాయి. రక్తం చేతిగోళ్ళల్లోకి ప్రవహించింది. ముక్కుల్లోనుంచి వెచ్చటిపొగరావటం ప్రారంభించింది. ఆ అవస్థలోనే కారులో ఆ స్టారుతప్ప మరెవ్వరూ లేరని తెలుసుకొనేటప్పటికి మళ్ళా ఆశకలిగి మనస్సుని చిక్కబట్టుకోటానికి ప్రయత్నించాడు.

శశిరేఖ కారుదిగి, అటూ ఇటూ చూస్తూ నిలబడింది. ఆమెను చూచి దారిచ్చింది జనం. ఆమె వెంటనే వెళ్ళాడు కోటయ్య. కాని లోపల టిక్కెట్లిచ్చే కిటికీదగ్గర జనం విరగబడి గుంపులుపడి తొక్కుకుంటున్నారు. భారతదేశంలోని ఛండాలమంతా అక్కడే కేంద్రీకరించినట్లుంది. ఆమె ముఖంమీద చీకాకురేఖలుకనిపించినయి. టిక్కెట్టు తెచ్చిచ్చే పుణ్యమూర్తుల కోసం వెతికింది కోటయ్య గ్రహించాడు. అదే సమయం అనుకున్నాడు. ధైర్యమే శ్రీమహాలక్ష్మి అనుకున్నాడు. అవకాశాన్ని జారవిడువగూడదను కున్నాడు. భుజస్పందనంచేసి, ఆమెదగ్గరకువెళ్ళి వూపిరి బిగబట్టాడు. ఆమె జనంమీదనుంచి టిక్కెట్లిచ్చే కిటికీలోకి చూస్తూంది.

కోటయ్య గొంతు సవరించుకొని మర్యాదగా, నాజూగ్గా పలకరిద్దా మనుకున్నాడు కంఠంపెళంకాలేదు. ఏదో గొణిగాడు....సణిగాడు. ఆమె అతనివైపు చూచి, "టిక్కెట్టు తెచ్చిపెడతావా?!" అని అడిగింది.

అతనికి అమితానందం కలిగింది. దప్పికతో ఎండుకుపోయిన గొంతులో అమృతధారలు పడినట్లుంది. దురదపుట్టినచోట పెరిగినగోళ్ళతో గోక్కున్నట్లుంది. పెరిగినగడ్డం గీక్కున్నట్లుంది.

"ఓ!" అన్నాడు.

ఆమె పర్సులోనుంచి డబ్బులుతీసి అతనిచేతిలోపెట్టింది. అతడు మొదట వేసుకున్న ప్లాన్ప్రకారం డబ్బు తీసుకోదలచలేదు. కాని తీసు కున్నాడు. ఎంత మారదామనుకున్నా గుమాస్తాయేగద!

డబ్బు గుప్పెట్లో పెట్టుకొని ఒక్కవిసుర్లో కిటికీదగ్గరకు వెళ్ళటానికి ప్రయత్నించాడు. హిట్లరు పిన్సర్ ఉద్యమాన్ని అవలంభించాడు. కాని, లాభంలేకపోయింది. క్షణంలో మళ్ళీ యథాస్థానానికే వచ్చాడు. ఉక్రోశం వచ్చింది. శశిరేఖ తన్ను గమనిస్తూ వుందని గ్రహించాడు. పెయ్యేనుగుల బలంతో, తొమ్మిదివందలతొంభైతొమ్మిది సింహాలధైర్యంతో కళ్ళుమూసుకొని జనంలో పడ్డాడు కోటయ్య. ఒకడుబూట్సుకాళ్ళతో అతని కాళ్ళని నలగదొక్కాడు. ఒక లావాటివాడు భుజంతో ఒకతాపు తాపాడు. మరొకడు చొక్కాపట్టుకొని వెనక్కుగుంజాడు. ఇంకొకడు బూతులుకూసి గడ్డం పట్టుకొని వెనక్కు నెట్టాడు. ఇవన్నీ తప్పించుకొని పూర్తినైతికబలంమీద సహాయ నిరాకరణచేసి, కిటికీదగ్గరకు చేరుకున్నాడు కోటయ్య. టిక్కెట్టుతీసుకున్నాడు. టిక్కెట్లూ, చిల్లరడబ్బులూ గుప్పెట్లోకి పెట్టుకొని అవ్యూహంలోనుంచి బయటపట్టానికి ప్రయత్నించాడు. ఒకడు ముందుకు నెట్టాడు. ఒకడు వెనక్కు నెట్టాడు; ఒకడు పక్కకు నెట్టాడు. ఏమీ చెయ్యలేక అలాగే నిలబడ్డాడు కోటయ్య. ఆ గుంపే అటునెట్టి యిటునెట్టి, అటుతోసి ఇటుతోసి, అటుగుంజి యిటుగుంజి బయటకు విసిరివేసింది. అతడు రొప్పుకుంటూ వెళ్ళి శశిరేఖ చేతిలో టిక్కెట్టూ, చిల్లరడబ్బులూ వుంచి చిరునవ్వు నవ్వాడు.

ఆమె తీసుకుంది. అతన్ని ఎగాదిగా చూసింది. ఒక్కక్షణం ఆలోచించింది. కోటయ్య గ్రహించాడు. రేపు తనింటికి రమ్మని ఆహ్వానిస్తుంది. వెళ్తాడు కృతజ్ఞత చూపుతుంది. నెమ్మదిమీద ఆ కృతజ్ఞతే ప్రేమగా మారుతుంది. ప్రేమ బంధాలన్నీ యిలాగే ఏర్పడ్డాయనీ, ఇలాగే బిగిశాయనీ, అతడు చిన్నప్పుడు చదువుకోలా?

ఆమె కోటయ్య చెయ్యి పట్టుకుంది. అరచేతిలో ఏదో వుంచింది. గబగబా వెళ్ళిపోయింది. వెనక్కి వెనక్కి తిరిగిచూస్తూ వెళ్ళింది. ఆమె చెయిపట్టుకునేటప్పటికే అతని ప్రాణాలు జివ్వున లాగాయి. ఏం జరుగుతున్నదో సాదా తెలుసుకోలేకపోయాడు. ఉడుకు తగ్గింతర్వాత చూసుకోగా చేతిలో చిల్లరడబ్బులు-టిక్కెట్టుపోగా మిగిలిన చిల్లరడబ్బులు ఎంతవవి

చేసింది! తన్ను గురించి ఏమనుకుంది? తా నెవరనుకుంది? టిక్కెట్టు తెచ్చి పెట్టినందుకు ఈ పారితోషికం యిచ్చిపోతుందా?

"హు!"

అవమానంతో అతని శరీరం తుకతుక ఉడికింది. ఆవేశంతో వెర్రె క్కింది. శశిరేఖని పట్టుకొని, ఆమె కట్టుకున్న తెల్లనిచీరెమీద సిరాబుడ్డి వొలకపోయబుద్ధయింది. పౌడర్ రాసుకున్న మొహానికి బలవంతంగా పేడ పూస్తే యేమవుతుంది? కోటయ్యలో అర్థంకాని గంగిర్లు బయల్దేరాయి. ఈ ప్రపంచమంతా నిర్ఘాంతపడి చూసే పనేదో చెయ్యాలనిపించింది. పక్కన బురదలో పొర్లాడే పందిని లేపిపంపి దానిస్థానే తాను పొర్లాడితే! హాలుకి అతికించిన సినిమాబొమ్మని సరిగ్గా మధ్యకు చించితే! తనబట్టల్ని బదాబదలుగా చించుకొని, ఆ జనం మధ్య నిలబడి శరభ శరభో అని పర వళ్ళు తొక్కితే! వారందరి మొహానా వరసగా తుపుకు తుపుకున వూస్తే!

కాని యివేమీ చెయ్యలేదు. తనలోతాను నవ్వుకున్నాడు. నెమ్మదిగా యింటికి వెళ్ళాడు. గదిలో ప్రవేశించి దీపం వెలిగించి నెమ్మదిగా పక్క మీద కూర్చున్నాడు. తల నాదుగావుంది. అంతా గందరగోళంగా అయోమయంగా వుంది. కాని హృదయంలోని ఒకపొరలో సంతోషం, ఆశా, తృప్తీ కలిగాయి. చేతిలోని చిల్లర డబ్బులు యెగరవేస్తూ, యీల వేస్తూ కూర్చున్నాడు. చెంబుతో నీళ్ళు పెట్టటానికి వచ్చిన దాసీ గోవిందమ్మ ఆతని వైఖరి చూచి గుమ్మంలోనే నిలబడిపోయింది. కోటయ్య గోవిందమ్మను చూశాడు. ఆమె జుట్టు రేగింది. ముంగురులు మొహంమీద చిందరవందరగా పడివున్నయ్. చెంపలనిండా మసి—చీర పైకి ఎగకట్టింది. పమిట వీపుమీద నుంచి తీసి బొడ్లో దోపింది. ఆ విగ్రహం అతని హృదయానికి శాంతి నిచ్చింది. ఆపేక్షగా చూశాడు. చేతిలోని చిల్లరడబ్బులు—శశిరేఖ యిచ్చిన డబ్బులు—టిక్కట్లుపోగా మిగిలిన డబ్బులు గులగులమన్నయ్. నలిపి ముద్దగాచేసి మింగేద్దామన్నట్లు మంచంమీదనుంచి లేచాడు. గోవిందమ్మ సిగ్గుపడకుండా గది ప్రవేశించింది. అతడు ఒకడుగు ముందుకు వేశాడు. గోవిందమ్మ నీళ్ళచెంబు మంచం తలదగ్గరపెట్టి చిరునవ్వు నవ్వింది.

)o....o....o(